ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
24 అక్టోబర్
2024





# నేటి నుంచి భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు

## 'చిన్నస్వామి'కి భిన్నంగా పుణె పిచ్.. స్పిన్‌తో తిప్పేసేందుకు ఇరు జట్లు సిద్ధం




పూణె: న్యూజిలాండ్‌తో ఇటీవలే బెంగళూరులో ముగిసిన తొలి టెస్టులో అనూహ్య ఓటమిని ఎదుర్కొన్న టీమ్‌ఇండియా.. గురువారం నుంచి పుణెలో మొదలయ్యే రెండో టెస్టును గెలిచి సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్ అయినా రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకున్నట్టే కనిపించిన రోహిత్ సేన మరోసారి కివీస్ పేసర్లకు దాసోహమై భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. ఈ నేపథ్యంలో 'చిన్నస్వామి'కి భిన్నంగా పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) పిచ్ ఉండనున్నట్టు తెలుస్తోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ నేపథ్యంలో పేస్ పిచ్‌లు తయారుచేయించుకుని పప్పులో కాలేసిన భారత్.. పుణెలో మాత్రం సంప్రదాయ స్పిన్ పిచ్‌పై కివీస్‌ను తిప్పేసేందుకు సిద్ధమైంది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ సన్నాహకాల్లో ఉన్న మెన్ ఇన్ బ్లూ.. ప్రయోగాలకు ఫుల్‌స్టాప్ పెట్టి సిరీస్‌ను 2-1తో గెలవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు 36 ఏండ్ల తర్వాత భారత్‌లో భారత్‌ను టెస్టు మ్యాచ్‌లో ఓడించిన న్యూజిలాండ్.. పుణెలో గెలిచి సిరీస్‌ను ఇక్కడే పట్టేయాలని తహతహలాడుతోంది.

### సెలక్షన్ తిప్పలు!

రెండో టెస్టులో రోహిత్ సేనకు సెలక్షన్ తిప్పలు తప్పేలా లేవు. మెడ కండరాల గాయంతో బెంగళూరు టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ రెండో టెస్టుకు ఫిట్‌గా ఉండనున్నాడు. దీంతో మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ లేదా సర్ఫరాజ్ ఖాన్‌లో ఎవరో ఒకరిపై వేటు పడనుంది. ఇరానీ కప్‌లో ద్విశతకం, తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగుల మేటి ఇన్నింగ్స్‌తో సర్ఫరాజ్ జోరుమీదున్నాడు. కానీ రాహుల్ మాత్రం బంగ్లా సిరీస్‌తో పాటు బెంగళూరు టెస్టులోనూ విఫలమవడంతో అతడిని పక్కనబెట్టాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. కానీ హెడ్‌కోచ్ గంభీర్ మాత్రం రాహుల్‌కు తమ మద్దతు ఉంటుందని చెప్పడంతో సర్ఫరాజ్‌పై వేటు పడనుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక గత టెస్టులో విఫలమైన జైస్వాల్ ఈ మ్యాచ్‌లో బ్యాట్ ఝుళిపించాలని భారత్ కోరుకుంటోంది. ఈ ఏడాది తొలి అర్ధ సెంచరీ చేసిన విరాట్ కోహ్లి, కెప్టెన్ రోహిత్ కూడా భారీ ఇన్నింగ్స్‌లు బాకీ ఉన్నారు. ఐదేండ్ల క్రితం ఇక్కడ సౌతాఫ్రికాతో జరిగిన టెస్టులో కోహ్లీ 254 పరుగులతో అజేయంగా నిలిచి ఈ ఫార్మాట్‌లో తన అత్యుత్తమ స్కోరును నమోదుచేయగా తాజాగా అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండటంతో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో భారత్ బరిలోకి దిగే అవకాశముంది. సిరాజ్ స్థానంలో ఆకాశ్ దీప్‌ను ఆడించనున్నట్టు తెలుస్తోంది.

జోరుమీదున్న కివీస్:

బెంగళూరు టెస్టు ఇచ్చిన విజయంతో జోరుమీదున్న న్యూజిలాండ్.. స్పిన్‌కు స్వర్గధామమైన పుణెలో భారత్‌ను ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆ జట్టు స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ లేకున్నా డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్, విల్ యంగ్, డారిల్ మిచెల్ వంటి నాణ్యమైన ఆటగాళ్లు కివీస్ సొంతం. స్పిన్ ఫ్రెండ్లీ పిచ్ కావడంతో మిచెల్ శాంట్నర్‌ను మ్యాచ్ ఆడించే ఆలోచనలో ఆ జట్టు ఉంది. శాంట్నర్, అజాజ్ పటేల్‌తో పాటు రచిన్, ఫిలిప్స్ భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. భారత్‌లో ఇంతవరకూ టెస్టు సిరీస్ గెలవని కివీస్.. పుణెలో అద్భుతం చేస్తే సరికొత్త చరిత్ర సృష్టించినట్టే!

### తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, పంత్, రాహుల్/సర్ఫరాజ్, జడేజా, అశ్విన్, కుల్‌దీప్, బుమ్రా, సిరాజ్/ఆకాశ్

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, బ్లండెల్, ఫిలిప్స్, సాంట్నర్, సౌథీ/ఓరూర్కీ, హెన్రీ, అజాజ్

# అమ్మాయిల వన్డే సమరం




అహ్మదాబాద్: టీ20 ప్రపంచ కప్‌లో అంచనాలను అందుకోలేకపోయింది హర్మన్‌ప్రీత్ కౌర్ సేన. ఈనేపథ్యంలో వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్‌పై మన మహిళలు దృష్టి సారించారు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ ద్వారా మెగా టోర్నమెంట్ సన్నాహకాలను ఆరంభించనున్నారు. మొదటి మ్యాచ్ గురువారం జరగనుంది. తదుపరి రెండు వన్డేలకూ అహ్మదాబాదే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సిరీస్ కెప్టెన్ హర్మన్‌కు ఎంతో కీలకం. కారణం..ఇటీవలి ప్రపంచ కప్‌లో హర్మన్ సారథ్యంలో జట్టు గ్రూప్ దశనుంచే వెనుదిరగడం. పైగా..టీ20 వరల్డ్ కప్ గ్రూప్ ఆరంభ మ్యాచ్‌లో ఇదే న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓడడం టోర్నీలో జట్టు అవకాశాలను దెబ్బతీసింది. మరోవైపు న్యూజిలాండ్ ప్రపంచ కప్‌ను కైవసం చేసుకొని ఉత్సాహంతో భారత్‌లో అడుగుపెట్టింది. టీ20 ప్రపంచ కప్‌లో దారుణ వైఫల్యం దరిమిలా హర్మన్ కెప్టెన్సీపై వేటు పడుతుందని అంచనా వేసినా..సెలెక్టర్లు ఆమెపై నమ్మకముంచారు.

పైగా..ఇటీవలి కాలంలో 35 ఏళ్ల హర్మన్ సారథ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక..కివీసతో సిరీస్‌కు రిచా ఘోష్, ఆల్‌రౌండర్ ఆశా శోభన అందుబాటులో ఉండడంలేదు. సీమర్ పూజా వస్త్రాకర్‌కు విశ్రాంతి నిచ్చారు. దాంతో పలువురు అన్‌క్యాప్డ క్రికెటర్లకు జట్టులో చోటు కల్పించారు. ఓపెనర్లు షఫాలీ వర్మ, మంధాన, జెమీమా, కౌర్‌లాంటి స్టార్లంతా పూర్తి స్థాయి ప్రదర్శన కనబరిస్తే తప్ప న్యూజిలాండ్‌ను అడ్డుకోవడం అంత సులభంకాబోదు.





# టీ20ల్లో 344/4

## అత్యధిక స్కోరుతో జింబాబ్వే ప్రపంచ రికార్డు

నైరోబీ: టీ20 క్రికెట్‌లో అత్యధికంగా 344 పరుగులు సాధించిన జట్టుగా జింబాబ్వే చరిత్ర సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ సబ్ రీజినల్ ఆఫ్రికా క్వాలిఫయర్స్ గ్రూప్-బిలో బుధవారం గాంబియాతో మ్యాచ్‌లో జింబాబ్వే 290 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 4 వికెట్లకు 344 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ క్రమంలో గతేడాది ఆసియా క్రీడల్లో మంగోలియాపై నేపాల్ సాధించిన 314 పరుగుల రికార్డును అధిగమించింది. సికందర్ రజా (43 బంతుల్లో 7 ఫోర్లు, 15 సిక్సర్లతో 133 నాటౌట్)తోపాటు టి.మరుమణి (19 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 62), క్లైవ్ మడండే (53 నాటౌట్), బ్రియాన్ బెన్నెట్ (50) రాణించారు. జింబాబ్వే తరపున టీ20ల్లో శతకం సాధించిన తొలి ఆటగాడిగా రజా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇక ఛేదనలో గాంబియా 14.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. రిచర్డ్ ఎన్‌గర్వ, బ్రండన్ మవుటా చెరో 3 వికెట్లు పడగొట్టాడు.

# దంగల్‌తో మాకు దక్కింది.. గోరంతే

## బబితా ఫోగాట్ సంచనల వ్యాఖ్యలు



ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్' టీమ్‌పై రెజ్లర్ బబితా ఫొగాట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తమ జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కిన 'దంగల్' మూవీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పేపర్లో వచ్చిన కథనం చదివి దర్శకుడు నితేశ్ తివారీ తమని సంప్రదించారని తెలిపారు. చండీగఢ్‌కు చెందిన ఒక విలేకరి మా కుటుంబంపై (మహవీర్, ఆయన ఇద్దరు కుమార్తెలు గీత, బబిత) ఒక కథనాన్ని ప్రచురించాడు. ఆ వార్త చదివి బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ టీమ్ మమ్మల్ని సంప్రదించింది. మాపై ఒక డాక్యుమెంటరీ సిద్ధం చేయాలనుకుంటున్నానని ఆయన మాతో చెప్పారు. 2010లో ఇది జరిగింది. కొంతకాలానికి ఆయన స్క్రిప్ట్ సిద్ధం చేసి మమ్మల్ని కలిశారు. తాను సినిమా తెరకెక్కిస్తానని అన్నారు. కథ చెప్పారు. మేము చాలా ఎమోషనల్ అయ్యాం. అయితే, సినిమాలో మా పేర్లు వాడాలనుకోవడం లేదని చెప్పగా.. నా తండ్రి అంగీకరించలేదు. సినిమా చేస్తే మా పేర్లతోనే చేయమని చెప్పారు. దంగల్' రిలీజ్ అయ్యాక.. మా కుటుంబం మొత్తం సినిమా చూశాం. నా చిన్ననాటి రోజులు గుర్తుకువచ్చి భావోద్వేగానికి గురయ్యానని బబిత తెలిపారు. ఈ సినిమా రూ.2000 కోట్లు వసూలు చేసినప్పటికీ తమకు మాత్రం కోటి రూపాయిలు మాత్రమే అందాయని అన్నారు. 'దంగల్' సక్సెస్ అయ్యాక ఆమిర్‌ఖాన్ టీమ్‌ను తన తండ్రి సంప్రదించినట్లు చెప్పారు. తమ గ్రామంలో అకాడమీ నిర్మించేందుకు సాయం చేయమని కోరగా.. అస్సలు పట్టించుకోలేదన్నారు. అకాడమీ నిర్మాణానికి రూ.5 కోట్లు వరకూ ఖర్చు అవుతుందని.. అంత డబ్బు తమ వద్ద లేదని అందుకే టీమ్‌ను సంప్రదించామని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించాడంటూ జాతీయ రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ పై భారత స్టార్ రెజ్లర్లు దిల్లీ వీధుల్లో చేసిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ నిరసన ఆలోచనతో భాజపా నేత బబితా ఫొగాట్ తమను సంప్రదించారని సాక్షిమాలిక్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా బబిత స్పందించారు. ఆమె పదేపదే నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. లైంగిక వేధింపుల విషయంలో ఆమె నాపై విమర్శలు చేసినా చేస్తారు. గంగానదిలో పతకాలను వదిలేయాలనే ఆలోచన కూడా బబితదే అని చెప్పినా చెప్తారు. అసలు నిరసన వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ ఎవరి కోసం ఆహారం పంపారు..? ఆ విషయంపై సాక్షి స్పష్టత ఇవ్వాలని వ్యాఖ్యానించారు.

